

- కేంద్ర బడ్జెట్‌లో పోలవరంపై కేంద్రం మరింత కనికరం చూపింది. చాన్నాళ్లుగా మూలనపడిన ఈ ప్రాజెక్టును గట్టెక్కించే దిశగా శరవేగంగా నిధులు కేటాయిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర బడ్జెట్‌లోను ఐదు వేల 936 కోట్ల రూపా యల పద్దు చూపించారు. గడిచిన ఐదేళ్లలో ఇంత మొత్తంలో కేటాయించడం దాదాపు ఇదే ప్రథమం.
- ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీనికి కేంద్రం ఊతమిస్తూ వస్తోంది. ఈ మధ్యనే గ్రాంటు రూపంలో రూ.12,157 కోట్లు కేంద్రం ప్రకటించగా, తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోను భారీ కేటాయింపులపై హర్షం వ్యక్తమవుతోంది. ఇక పోలవరం పూర్తి కావడానికి ఆటంకాలు లేవనే పరిస్థితి స్పష్టమవుతోంది.

పోలవరం ప్రాజెక్టుకు భారీ ఊతం

కేంద్రంలో నిర్మలమ్మ బడ్జెట్ కాస్తంత ఆశాజనకంగా, కొంత నిరుత్సాహంగానే సాగింది. పోలవరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించడం సహజంగానే జనామోదం లభించింది. బడ్జెట్‌లో సాగు నీటి పథకాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చిందో అదే వ్యవసాయం, ఆక్వా వంటి కీలక రంగాలకు అతి పెద్ద ప్రోత్సాహం దక్కలేదు. వేతన జీవులు, ఇతర వర్గాలు ఆశిస్తున్న దానికంటే రికార్డుస్థాయిలో ఆదాయపు పన్ను పరిమితిని పెంచడం మరింత రంజింపచేసింది. రైల్వే కూతలేంటో ఇంకా బహిరంగం కాలేదు. నేడో, రేపో అవి కూడా అంకెల రూపంలో సాక్షాత్కరించబోతున్నాయి.

మురిపించి.. మెప్పించి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)
(పాలకొల్లు/నరసాపురం/ఆకివీడు రూరల్-ఆంధ్రజ్యోతి)

నిర్మలమ్మ బడ్జెట్‌పై హర్షాతిరేకాలు.. విపక్షాల పెదవి విరుపులు

అభివృద్ధే ధ్యేయంగా



దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉంది. మధ్యతరగతి ప్రజల జీవన విధానాల్ని మెరుగుపరచడమే లక్ష్యంగా వారికి భారీ ఊరట కల్పించేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది. వికసిత్ భారత్-2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యాన్ని చేరుకునేలా ఈ బడ్జెట్ ఉంది.

- శ్రీనివాస వర్మ, కేంద్ర మంత్రి

వికసిత్ భారత్‌కు..



కేంద్ర బడ్జెట్ వికసిత్ భారత్ దార్శనికతకు అద్దం పట్టింది. ఏపీ జీవనాడి పోలవరం కేటాయింపులు అద్భుతం. ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయింపుతోపాటు సమాంతరంగా పోలవరం సవరించిన అంచనాలు రూ.30,436 కోట్లకు ఆమోదం తెలపడం హర్షించతగ్గ పరిణామం.

- పుట్టా మహేశ్‌కుమార్, ఏలూరు ఎంపీ

రాయితీల వరం..



బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎన్నో రాయితీలు ఇచ్చారు. వీటి వల్ల రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుంది. మహిళలు, పేదలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.5 లక్షలకు పెంచడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారు. రోడ్లు, వంతెన నిర్మాణానికి రూ.240 కోట్లు కేటాయించడం శుభ పరిణామం.

- బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే

రైతన్నకు ఏదీ ఊరట ?

కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి అతి పెద్ద ఊరట దక్కుతుందని అందరూ భావించారు. కాని దీనికి విరుద్ధంగా కేవలం రెండు, మూడు రకాల పప్పు దినుసులను మాత్రం ప్రోత్సహించడం, దిగుమతి చేసుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రత్యేకించి కిసాన్ సమ్మాన్ పథకం కింద రైతుకు ఊతమిచ్చే సాయాన్ని ఈసారి పెంచకుండా మొండి చెయ్యి చూపించారు. దీంతో వ్యవసాయదారులకు ఈసారి అతి పెద్ద ఊరట దక్కకుండా పోయింది. ప్రత్యేకించి ఎరువులు, పురుగు మందుల విషయంలోను, కనీస మద్దతు ధరల విషయంలోను బడ్జెట్‌లో ప్రస్తావన మరిచారు. ఆక్వా రంగంలో కేవలం శీతలీకరించిన చేప ముక్కలపై కస్టమ్స్ సుంకాన్ని 30 నుంచి ఐదు శాతానికి తగ్గించారు. ఇవి తప్ప ఎగుమతుల విషయంలోను, చేపల మేత, విద్యుత్ సబ్సిడీల్లోను బడ్జెట్‌లో ఊరట దక్కక పోవడంతో ఆక్వా రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాలలో ఆక్వా సాగవుతున్నది. రైతుల పక్షాన కిసాన్ క్రెడిట్ కార్డులు పరిమితి రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచారు.

కాస్తో కూస్తో ఊరట

కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే 36 రకాల ఔషధాలను బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఈ వ్యాధులకు సంబంధించి రోగులకు మందుల కొనుగోలులో కాస్తంత ఊరటే. మొబైల్ రేట్లు కాస్త తగ్గుముఖం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వృద్ధులకు వడ్డీపై టీడీఎస్‌ను కాస్త తగ్గించారు. ఇంటరాక్ట్ ప్లాట్ ప్యానల్ డిసిప్లే సుంకాన్ని 10 నుంచి 20 శాతం పెంచారు.

పిల్లలతో ప్రయోగాలే ప్రయోగాలు..

ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడంతోపాటు పలు రకాల కొత్త తరహా ప్రయోగాలు ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం ఏటా వీటిని మంజూరు చేస్తోంది. ఒక్కో దానికి రూ.20 లక్షల వరకు వెచ్చిస్తోంది. 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది.












చిన్న వాటికి ఊతం..

బడ్జెట్‌లో చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెంచారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పెట్టుబడి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్న పారిశ్రామికవేత్తలకు మేలు జరగనుంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో వేలాది చిన్నతరహా పరిశ్రమలున్నాయి. బయట నుంచి అప్పులు తెచ్చి నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన రుణ పెంపు ప్రకటన అనేక మందికి మేలు చేయనుంది. అటు స్టార్టప్‌లకు రుణాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచారు.

వినిపించని రైళ్ల కూత
వృద్ధులకు ఊరట
మందులపై పన్ను మినహాయింపు

వేతన జీవులకు ఊరట

రూ.12 లక్షలకు ఆదాయపు పన్ను రాయితీ
ఉమ్మడి పశ్చిమలో 60 వేల మందికి లబ్ధి



కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపన్ను చెల్లింపు దారులకు భారీ ఊరట కలిగించారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిధి ఏకంగా రూ.12లక్షలకు పెంచారు. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 60వేల మంది వేతన జీవులకు ఊరట లభించింది. గతంలోఉన్న స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేలు పరిధిని, 75వేలుకు పెంచారు. అయితే ఇది ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఇది భారీ రాయితీగానే చెప్పవచ్చు. అయితే రూ.12 లక్షలపైబడి రూ.1రూపాయి ఆదాయం పొందినా పాత శ్లాబులు వర్తిస్తాయి. పాత విధానంలో రూ. 4 లక్షలకు పన్ను జీరోగా ఉంది. ఆపైన 8లక్షల ఆదాయానికి 5శాతం, రూ. 8 నుంచి 12లక్షల వరకు 10శాతం పన్ను గతంలో చెల్లిస్తున్నారు. నూతన విధానంలోనూ రూ. 12లక్షలు ఆదాయం మించితే మొత్తం ఆదాయానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాగా పాత పన్నువిధానం ఇంకా పూర్తిగా ముగియ లేదు. 2024 - 25 ఆర్థిక సంవత్స రానికి పాత విధానంలోనే పన్నుచెల్లించాల్సి ఉంటుంది

వృద్ధులకు వరాలు



- వృద్ధుల ఆదాయంపై ఇన్నాళ్లు పన్నుల పేరిట జేబులు గుల్ల చేసిన కేంద్రం.. ఈ సారి వారు అర్జించే బ్యాంకు డిపాజిట్ల వడ్డీపై పన్ను మినహాయింపును రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచింది.
- ఇంటి అద్దెలపై అనేక మంది వృద్ధులైన ప్రభుత్వ, ప్రైవేటు రిటైర్డ్ ఉద్యోగులు జీవిస్తున్నారు. వీరికి అద్దెపై వచ్చే వార్షికాదాయం రూ.2.40 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నును మినహాయించి రూ.6 లక్షలకు పెంచారు. ఈ నిర్ణయాలు ఉమ్మడి జిల్లాలో వందలాది మందికి మేలు చేకూర్చనున్నాయి.



పసిడిపై నో ట్యాక్స్

- పసిడిపై ఎలాంటి పన్ను విధించకపోవడంతో బులియన్ వ్యాపారులు, వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం బంగారం దిగుమతులపై ఆరు శాతం కస్టమ్స్ డ్యూటీ, మూడు శాతం జీఎస్టీ ఉంది. దేశంలో రోజు రోజుకు బంగారం దిగుమతులు పెరిగిపోవడంతో దీన్ని తగ్గించేందుకు పన్ను పెంచుతారని భావించారు. వీటి జోలికి వెళ్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



స్టాక్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన

- స్టాక్ మార్కెట్‌పై బడ్జెట్ మిశ్రమ స్పందన చూపించింది. షార్ట్ టర్మ్, లాంగ్ టార్మ్ గెయిన్స్‌పై మళ్లీ పన్ను పెంచుతారని మదుపుదారులు అంచనా వేశారు. వాటి జోలికి వెళ్లకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని మదుపుదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదాయ పన్ను పరిమితిని పెంచడం మార్కెట్‌కు ప్లస్ అయింది. ఊహించినట్లు పబ్లిక్ సెక్టార్‌కు ఎలాంటి కేటాయింపులు, రాయితీలు ఇవ్వలేదు. రైల్వే ఊసే లేదు. దీంతో ఈ రంగాల షేర్లు భారీగా పతనం కావడంతో మదుపుదారులు భారీగా నష్టాలను మూటకట్టుకున్నారు.

పేదల శ్రేయస్సుకు..



ప్రతిపాదిత పన్ను మినహాయింపు ప్రకటన మధ్య తరగతి ప్రజల ఆర్థిక శ్రేయస్సుకు దోహద పడుతుంది. తాజా బడ్జెట్ ప్రజల జేబులు నింపేందుకు, సేవింగ్స్ పెంచేందుకు ఉద్దేశించినట్టుగా ఉంది. జాతీయ శ్రేయస్సు దృష్ట్యా ఈ బడ్జెట్ కీలక అడుగు.

- గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మధ్యతరగతికి మేలు



ఆర్థిక రంగంలో భారత్ చెందుతున్న రూపాంతరాన్ని ఈ బడ్జెట్ ముందుకు తీసుకువెళుతుంది. మధ్యతరగతికి గృహ నిర్మాణం, ఉపాధి హామీ, స్టార్టప్ కంపెనీలకు పన్ను ప్రయోజనాలు, అంగన్‌వాడీ-2ను ప్రవేశపెట్టడం గొప్ప విషయం.

- సీహెచ్ విక్రమ్ కిశోర్, ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు

అంకెల గారడీయే..



బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు ఎలాంటి ప్యాకేజి లేకపోవడం దారుణం. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించడం, నిత్యావసర ధరలు నియంత్రించే ప్రతిపాదనలేవీ బడ్జెట్‌లో లేవు. అంకెల గారడీయే తప్ప పేదల బడ్జెట్‌కాదిది.

- బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

ఇది సంక్షేమ బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో పేద, మహిళ, మధ్యతరగతి సంక్షేమం కోసం పెద్ద పీట వేశారు. బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌పై వరాలు జల్లు కురిపించింది. రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయింపులతో పాటు పోలవరం ప్రాజెక్టుకు 5,936 కోట్లు ఇవ్వడం శుభపరిణామం.

- రెడ్డి అప్పలనాయుడు, ఆర్టీసీ జోన్ చైర్మన్

రైతులకు మొండిచెయ్యి



కేంద్ర బడ్జెట్‌లో రైతులకు మొండి చెయ్యి చూపించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టంపై హామీ ఇవ్వకుండా మోసగించారు. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరల తగ్గింపుపై ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ఇదంతా రైతులను వంచించడమే.

- కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

94.44 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజైన శనివారం రాత్రి 7గంటల సమయానికి 94.44 శాతం పూర్తి చేశారు. సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం 6గంటల నుంచే ప్రారంభించారు. జిల్లాలో 2,61,454 మంది లబ్ధిదారులు ఉండగా రూ.113 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం రాత్రి 7గంటల సమ యానికి డీఆర్‌డీఏ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలో 2,46,924 మందికి (94.44శాతం) రూ.106.55 కోట్లు అందజేయగా 14,530 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. 2వ తేదీ ఆదివారం కావడంతో ఫిబ్రవరి 3న మిగిలిన వారందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

చిత్తడిపై ఒత్తిడి..

8

చిత్తడి నేలల పరిరక్షణపై శాస్త్రవేత్తల హెచ్చరికలు - జీవరాశి మనుగడకు చిత్తడి నేలలు అవసరమంటూ దిశానిర్దేశం

నేడు చిత్తడి నేలల దినోత్సవం

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలుకు..
ఎంసీసీ బృందాలు ఏర్పాటు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం ప్రత్యేక అధికార బృందాలను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్, మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఈ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. మునిసిపల్ మండలాల వారీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కోసం 22 ఎంసీసీ బృందాలు, 21 స్పెషల్ వీడియో బృందాలు ఏర్పాటు చేశారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, నిడమర్రు, పెదపాడు, పెదవేగి, చింతలపూడి, ఉంగుటూరు, లింగపాలెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్, బుట్టాయిగూడెం, ద్వారకా తిరుమల, కుక్కునూరు, టి.నరసాపురం, కొయ్యలగూడెం, మండలాలకు ఒక్కొక్క బృందం , ఏలూరు కార్పొరేషన్‌కు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా 21 ప్రత్యేక వీడియో బృందాలను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శన కోసం ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో అమలులోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసిందని ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహణ, మార్చి 3న ఓట్ల లెక్కింపు, మార్చి 8తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు
పీజీఆర్ఎస్ నిలుపుదల

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నదున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ను తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏలూరు కలెక్టరేట్ కార్యాలయం, జిల్లాలోని అన్ని డివిజన్, మండల కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

నూజివీడు పురపాలకంలో..
క్యాంప్ రాజకీయాలు

ఆసక్తి రేపుతున్న వైస్-చైర్మన్ ఎంపిక

నూజివీడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):నూజివీడు పురపాలక రాజకీయం వైస్-చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ప్రకటించడంతో ఒక్కసారిగా వేడెక్కింది. నూజివీడు పురపాలకంలో ఆది నుంచి వైసీపీకి పట్టు ఉంది. తాజా మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు గెలుపు ఓటములలో నూజివీడు పట్టణం కీలకం. ఇక్కడ 32 వార్డులలో 24 వార్డులు గెలుచుకుని, నిన్నటి వరకు చైర్మన్, ఇద్దరు వైస్-చైర్మన్‌లతో అధికారాన్ని అనుభవించిన వైసీపీ ఇప్పుడు ఆ కౌన్సిలర్లను కాపాడుకోవడానికి క్యాంపులను నిర్వహిస్తోంది. టీడీపీకి ఎనిమిది మంది కౌన్సిలర్ల బలం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో కౌన్సిల్‌లో వైస్-చైర్మన్‌తోపాటు వీలైతే చైర్‌పర్సన్ పదవిని చేజిక్కించుకుంటుందేమోనన్న భయంతో ముందస్తు జాగ్రత్తచర్యగా స్థానిక వైసీపీ నాయకులు తెలంగాణ రాష్ట్రం పరిధిలో భద్రాచలం, కొత్తగూడెం మధ్య తమ కౌన్సిలర్లతో క్యాంపు నిర్వహిస్తున్నట్టు సమాచారం. మరోవైపు నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, పట్టణంలో టీడీపీ ముఖ్య నేతలతోపాటు వైసీపీ నుంచి టీడీపీలోకి రావడానికి సుముఖంగా ఉన్న కొంత మంది వైసీపీ కౌన్సిలర్లతో హైదరాబాద్‌లో క్యాంపు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ నాయకులటచ్‌లోకి వచ్చి క్యాంపునకు వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. టీడీపీకి నూజివీడు కౌన్సిల్‌లో అధికారం దక్కాలంటే వారికున్న బలానికి తోడు మరో 7 మంది కౌన్సిలర్లు అవసరం.

మానవాళి మనుగడలో చిత్తడినేలలు ప్రధాన పాత్ర వహిస్తాయనడంలో సదేహం లేదు.. ఎందుకంటే సృష్టిలోని అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడినేలల్లోనే మనుగడ సాగిస్తుంటాయి. అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న చిత్తడి నేలల జాబితాలో కొల్లేరు సరస్సు ఉండటం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయం.. అయితే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఈ నేలల మనుగడను పరిరక్షించుకోపోతే భావితరాలకు ప్రమాదం పొంచి ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చిత్తడినేలలు అంతరించిపోతే పలురకాల పక్షులు, జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్ తరాలు వాటిని చూడాలంటే జూపార్కులు, చరిత్రనో తిరగేయాల్సి ఉంటుంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ప్రపంచ మేధావులు ఈ నేలలపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి రెండును ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2వ తేదీ ఆదివారం రావడంతో సోమవారం 3వ తేదీన ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

- కైకలూరు(ఆంధ్రజ్యోతి)

నేడు చిత్తడి నేలల దినోత్సవం



చిత్తడిపై ఒత్తిడి..

- చిత్తడి నేలల పరిరక్షణపై శాస్త్రవేత్తల హెచ్చరికలు • జీవరాశి మనుగడకు చిత్తడి నేలలు అవసరమంటూ దిశానిర్దేశం
- ఆటపాక పక్షుల కేంద్రంలో రేపు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు • భవిష్యత్ తరాల కోసం స్వచ్ఛందంగా పలువురి అవగాహన

మానవాళి మనుగడకు చిత్తడినేలలు ఎంతో దోహదపడతాయి. సృష్టిలో సహజసిద్ధంగా ఏర్పడిన వనరులను కాపాడుకుంటే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలుతాం. సృష్టిలో ఉన్న అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడినేలల్లోనే ఉంటాయి. పక్షులకు ఈ నేలల్లో ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. దీని ప్రాముఖ్యతను గుర్తించి ప్రపంచంలో వివిధ దేశాలు చిత్తడి నేలలను రక్షించుకోవడమే గాక ప్రతి ఏటా ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు చిత్తడి నేలల జాబితాలోనే ఉంది. పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భావితరాలకు చిత్తడినేలలు ఉండవు, ఇప్పటికే పలురకాల పక్షులు, జంతువులు అంతరించిపోయాయని, కొన్ని రకాల జంతువులు పక్షులను చూడాలంటే జూపార్కులు, చరిత్ర పుస్తకాల్లో చూడాల్సి వస్తోందని ప్రపంచ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1971లో ప్రపంచ స్థాయి సదస్సు

చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించి ఇరాన్ దేశంలోని రామ్‌సర్ నగరంలో 1971వ సంవత్సరంలో ప్రపంచ దేశాలన్నీ కలిసి సదస్సును నిర్వహించాయి. ఈ సదస్సుల్లో చిత్తడినేలల ఆవశ్యకతను గుర్తించారు. ప్రపంచంలోని ఏ దేశంలో ఉన్నా వాటిని పరిరక్షించాలని ఆయా దేశాల ప్రతినిధులు తీర్మానించారు. అదే రోజును పురస్కరించుకుని ఫిబ్రవరి 2ను చిత్తడినేలల దినోత్సవంగా గుర్తించి రామ్‌సర్‌సైట్‌గా నామకరణం చేశారు. ప్రపంచంలో పలు దేశాల్లో చిత్తడినేలలుగా పేరొందిన ప్రాంతాలను ఈ సైట్‌లోనికి తీసుకొచ్చారు. చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా దేశాలకు వివరించారు. భారత దేశంలో అతిపెద్ద సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొల్లేరు సరస్సును 2002 సంవత్సరంలో రామ్‌సర్ సైట్‌లోకి తీసుకున్నారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సరస్సు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

2009 నుంచి అవగాహనకు కార్యాచరణ

2006లో కొల్లేరును అటవీ శాఖ అధికారులకు అప్పగించగా 2009 నుంచి కైకలూరు మండలం ఆటపాకలోని వలస పక్షుల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి కొల్లేరు చిత్తడినేలల ఆవశ్యకతపై పలు పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అటవీశాఖ అధికారులు బహుమతులు పంపిణీ చేస్తారు.

మరచిన తాటిదోనెల పోటీలు

చిత్తడినేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2018వ సంవత్సరంలో కొల్లేరులోని సర్కారు కాలువలో తాటి దోనెల పోటీలను నిర్వహించారు. రెండు సంవత్సరాల పాటు ఈ పోటీలను కొనసాగించినా తరువాత నుంచి వీటిని అధికారులు మరచిపోయారు. తాటి దోనెల పోటీల తో ప్రజలకు చిత్తడినేలల ఆవశ్యకత తెలుస్తుందని వీటిని ప్రారంభించారు. ఈ పోటీలతో కొల్లేరు ప్రజల్లో తాటిదోనెలపై ఆసక్తి పెరగడమే గాక వీటిని చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేవారు. అటవీ శాఖ అధికారులు వీటిని నిర్వహించడంలో విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రేపు విద్యార్థులకు పోటీలు

చిత్తడినేలల ఆవశ్యకతను తెలియజేసేలా ప్రతి ఏటా ఫిబ్రవరి 2న అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే ఈ ఏడాది 2వ తేదీ ఆదివారం రావడంతో 3వ తేదీన సోమవారం వెయ్యిమంది విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టాం.. విద్యార్థులకు చిత్తడినేలలు, కొల్లేరుపై వ్యాస రచన, డిబెట్, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం అటవీ శాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

- రామలింగా చార్యులు, రేంజర్, కైకలూరు

చిత్తడి నేలలతో భూగర్భ జలాల పెరుగుదల

కాళ్ళ : అనేక జీవరాశుల మనుగడతో పాటు మానవుల మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు చిత్తడి నేలలు ఎంతో అవసరమని రైతు కార్యాచరణ సమితి సభ్యులు మంతెన రవివర్మ పేర్కొన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆటపాకలో కొల్లేరు పక్షుల అభయారణ్యంలో చిత్తడి నేలల ప్రాముఖ్యతపై కొల్లేరు సరస్సు అభివృద్ధి సమితి, స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలలు నీటిని శుభ్రపరచడంతో పాటు భూగర్భ జలాలను పెంచడంతో పాటు వరదల తీవ్రతను తగ్గిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి మురళి కృష్ణారావు, మంతెన హిమ, రామాయణం సతీష్, ఆకుల తేజ పాల్గొన్నారు.



చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరిస్తున్న రవివర్మ

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం

పోలవరం, ఫిబ్రవరి 1 : పోలవరం ప్రాజెక్టును విదేశీ నిపుణుల బృందం శనివారం పరిశీలించింది. ఈ బృందంలో అమెరికాకు చెందిన అంతర్జాతీయ నిపుణులు డియాన్ ఫ్రాన్‌క్కో డి కికో, డేవిడ్ పాల్ ఉన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న బృందం ప్రత్యేక వాహనాల్లో పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నారు. బోజన విరామానంతరం పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతానికి చేరుకుని అక్కడ డయాఫ్రంవాల్ ప్లాస్టిక్ కాంక్రీటు పనులు, డయాఫ్రం వాల్, డిశాండింగ్ పనులు పరిశీలించారు. ప్లాస్టిక్ కాంక్రీటు పనుల తీరు, డీశాండింగ్‌లో వస్తున్న మట్టి నమూనాలను పరిశీలించి, ఫొటో ఎగ్జిబిషన్‌ని తిలకించారు.అనంతరం సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు బావర్ కంపెనీ ప్రతినిధి, హసన్ మెగా కంపెనీ ప్రతినిధి అంగర సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహంలో అధికారులతో గంటసేపు సమావేశం నిర్వహించిన అనంతరం రాజమహేంద్రవరం తరలి వెళ్ళారు. ఈ బృందం ఆదివారం కూడా పోలవరం ప్రాజెక్టును పరిశీలించనుందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



పోలవరం ప్రాజెక్టు అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న విదేశీ బృందం



పోలీస్ వందనం స్వీకరిస్తున్న జడ్జి జస్టిస్ సురేష్ రెడ్డి

కేసులను త్వరగా విచారించాలి : హైకోర్టు జడ్జి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) :న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి తీర్పులను వెలువరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్ రెడ్డి అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యూడీషియల్ కాన్ఫరెన్సును జస్టీస్ సురేష్‌రెడ్డి నిర్వహించారు. ఈసందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ తీర్పుల్లో నాణ్యత లోపించకూడదని, అలాగే సుప్రీంకోర్టు సివిల్ కేసులపై త్వరగా తీర్పులను వెలువరించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు వివరాలను జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్‌ను శనివారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 3లక్షల 15వేల 261 మంది ఓటర్లు ఉన్నారని, ఇందుకోసం జిల్లాలో 440పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపును మార్చి 3వ తేదీ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు.

పీఏసీ చైర్మన్‌గా అంజిబాబు

తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్‌గా భీమవరం ఎమ్మెల్యే అంజిబాబును నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోనే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేశారు. అంజిబాబును పీఏసీ చైర్మన్‌గా నియమించారు. అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు. అంజిబాబు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పెనుగొండలో



పర్యటనకు విచ్చేసినప్పుడు ఎమ్మెల్యే అంజిబాబు, తెలుగుదేశం కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు కలిసి పీఏసీ చైర్మన్‌గా ఉత్తర్వుల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో అదేరోజు అంటే శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీఏసీ చైర్మన్ కేబినెట్ హోదా పదవి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జమా ఖర్చులు తెలుసుకోవడానికి పీఏసీ చైర్మన్‌కు అధికారం ఉంది. అంజిబాబుకు కేబినేట్ ర్యాంక్ కావడంతో భద్రత కూడా పెంచనున్నారు. మూడవ సారి ఎమ్మెల్యే కావడం, అభివృద్ధి విషయాల్లో అనుభవం అంజిబాబుకు కలిసి వచ్చింది.



తణుకు రూరల్ పోలీస్ స్టేషన్

తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు

వాస్తు దోషం!

- సిబ్బందికి మరింత బలపడిన అనుమానాలు
- గతంలోనూ అనేక సంఘటనలు
- సొంత భవనం కోసం జరగని ప్రయత్నాలు

తణుకు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి మృతి పట్ల పోలీస్ సిబ్బందిలో పోలీస్ స్టేషన్ వాస్తు పట్ల అనుమానం నెలకొంది. తణుకు రూరల్ స్టేషన్ ఏర్పడినప్పటి నుంచి సొంత భవనం కరువైంది. గతంలో తణుకు పట్టణంలోని కేశవ స్వామి ఆలయం, రాయల్ టాకీస్ మధ్యలో ఓ ప్రైవేట్ ఇంటిలో తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో తణుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తణుకు టౌన్, రూరల్ స్టేషన్‌లు ఒకే భవనంలో కొంతకాలం ఉన్నాయి. 2013లో తణుకు పట్టణంలోని పైడిపర్రు గ్రామం విలీనం కావడంతో 2014లో తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌ను పైడిపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి మార్చారు. పట్టణంలో ట్రాఫిక్‌కు దూరంగా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ భవనం వాస్తు బాగాలేదనే అభిప్రాయం సిబ్బందిలో నెలకొంది. ఒకప్పుడు పైడిపర్రు గ్రామ పంచాయతీగా సేవలందించిన ఈ భవనంలోనే ప్రస్తుతం రూరల్ పోలీస్ స్టేషన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. 1997లో ప్రారంభించిన ఈ భవనం ఎదుట ప్రస్తుతం సిమ్మెంట్ రోడ్డు మెరక చేయడంతో భవనం లోతుగా ఉంది. ఈ భవనంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పడిన కొత్తలో వేల్పూరులో ఓ మహిళ సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యకు పాల్పడటంతో అప్పటి ఎస్ఐ సస్పెన్స్‌కు గురయ్యారు. అనంతరం ఒక చోరీ కేసులో విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్న ఓ నిందితుడి ఆరోగ్యం విషమించడంతో రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో మృతుని కుటుంబానికి సిబ్బందితో పాటు మరి కొందరు చందాలు వేసుకుని పరిహారం చెల్లించినట్లు తెలిసింది.

తాజా వ్యవహారంతో మరింత భయం

తాజాగా ఎస్ఐ ఏజీఎస్ మూర్తి తన విధుల్లో చేరక ముందే జరిగిన గేదెలు చోరీ కేసుకు సంబంధించి తను పని చేసే స్టేషన్‌లో జరగని సెటిల్ మెంట్‌కు వీఆర్‌లోకి వెళ్లారని పోలీసు సిబ్బంది చెబుతున్నారు. చివరకు ఇదే స్టేషన్‌లో ఆయన ప్రాణాలు కోల్పోవడంతో సిబ్బందిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పరిణామాలతో కొంతమంది పోలీస్ సిబ్బంది ప్రస్తుతం రూరల్ పోలీస్ స్టేషన్ భవనం వాస్తురీత్యా సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ ఏర్పడి దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ సొంత గూడు ఏర్పడకపోవడం బాధాకరం. ఇటీవల కాలంలో ఎన్నో భవనాలు నిర్మించి ప్రభుత్వాలు శాంతి భద్రలకు సంబంధించిన పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం ఏర్పడకపోవడం ఆలోచించాల్సిన విషయం.



పార్థీవదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ఎస్ఐ మూర్తి అంత్యక్రియలు పూర్తి

స్వగ్రామం కె.గంగవరంలో నివాళులర్పించిన ఏఎస్పీ ప్రసాద్

కె.గంగవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తణుకులో చనిపోయిన ఎస్ఐ ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి పార్థీవదేహాన్ని పోస్టుమార్టం అనంతరం శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకెళ్లారు. శనివారం ఉదయం నుంచి గ్రామస్తులు, సహచర పోలీసు సిబ్బంది, బంధువులు సందర్శించి నివాళులర్పించారు. మూర్తి భౌతికకాయాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సానుభూతిని తెలిపారు. మూర్తి పనిచేసిన పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన పోలీసులు ఆయన బ్యాచ్‌కు చెందిన సహచర ఎస్ఐలు మూర్తి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కోటిపల్లి గోదావరి ఒడ్డున స్మశానవాటికకు తరలించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ, పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీబాషా ఆధ్వర్యంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు.



తాబేళ్ల కళేబరాలను పరిశీలిస్తున్న మత్స్య, పశు వైద్యాధికారులు

తాబేళ్ల మృత్యు ఘోషకు కారణమేంటి?

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : తీరంలో తాబేళ్ళ మృత్యు ఘోష ఆగడం లేదు, గత నాలుగు రోజుల నుంచి వరుసగా మృతి చెందతూనే ఉన్నాయి. శనివారం కూడా కొన్ని తాబేళ్లు ఒడ్డుకొచ్చి మృతి చెందాయి. మండలంలోని పీఎం లంక నుంచి మోళ్లపర్రు వరకు సముద్ర తీరం వెంబడి సుమారు 60కిపైగా తాబేళ్ళ కళేబరాలు దర్శనమిచ్చాయి. వరుసగా ఇలా తాబేళ్లు మృతిచెందడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటిగా కలుషిత నీటి వల్లే అని భావించారు.. అయితే మత్స్య సంపదకు ఎలాంటి నష్టం జరగకపోవడంతో తాబేళ్ల మృతికి కారణం ఏమిటో తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ఏలూరు నుంచి మత్స్య, పశువైద్య శాఖ అధికారులు శనివారం నరసాపురం తీరంలో పర్యటించి తాబేళ్ళ కళేబరాలను పరిశీలించి కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపనున్నారు. పరీక్షల అనంతరం కారణాలను నిర్ధారిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

3న బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యూత్ బాస్కెట్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు కొవ్వలి జడ్పీ హైస్కూల్లో 3వ తేదీన జరగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో ఆంధ్రప్రదేశ్ 8వ అంతర్ జిల్లాల అండర్ -16 బాలుర, బాలికల బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పోటీలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి కొవ్వలిలో ఎంపికలు ఉంటాయని తెలిపారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో నాగలక్ష్మి ప్రతిభ

భీమవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : భీమవరంలోని శ్రీవిష్ణు కళాశాలకు చెందిన ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.నాగలక్ష్మి ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో బాలికల విభాగంలో హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.రామకృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి నెల రెండవ వారం కర్ణాటకలో జరిగే సౌత్ జోన్‌లో హైజంప్ విభాగంలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థినిని సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించాలన్నదే తమ ధ్యేయమని వ.పా. బాపు(వడ్డాది పాపయ్య - బాబు)ఆర్ట్ అకాడమీ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు కొసనా భాస్కర రావు తెలిపారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో వ.పా. బాపు ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయిలో విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలను కొమ్మల మురళీ కృష్ణ ప్రారంభించారు. సుమారు జిల్లాలోని 30 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు హాజరుకాగా వారిని సీనియర్స్, జూనియర్, సబ్ జూనియర్స్‌గా మూడు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. రెండవరోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎన్టీ రామారావు శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో ఆర్టిస్టులు ఎన్టీఆర్ చిత్రాలను లైవ్ పెయింటింగ్ ద్వారా చిత్రీక రించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, రాము తెలిపారు.

స్టెమ్ కోర్సులపై పట్టు సాధించాలి : నిట్ డీన్

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు స్టెమ్ కోర్సులపై పట్టు సాధించాలని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ సందీప్ అన్నారు. ఏలూరులోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యా ర్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. దేశ పురోగతిలో ముఖ్యమైన టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు రామూర్తి, రామ్, శృతి, రేఖా కుమారి, శ్రీలత పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సమైక్యతా శిబిరం

నరసాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : నరసాపురంలోని వై.ఎన్. కళాశాలలో 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు తెలిపారు. శనివారం పాలకవర్గ సభ్యులతో కలిసి కళాశాలలో శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరానికి 12 రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది ఎన్ఎస్ఎస్ క్యాడేట్స్ హాజరవుతారని అన్నారు. మినిస్ట్రీ ఆఫ్‌యూత్, స్పోర్ట్స్, హైద్రాబాద్‌లోని ఎన్ఎస్‌పీ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. 2023లో వైఎన్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని, తిరిగి రెండేళ్లలో మరోసారి జాతీయ స్థాయిలో క్యాంపును నిర్వహించే అవకాశం కళాశాలకు దక్కడం గమనార్హమని అన్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా క్యాడేట్స్ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, అహార అలవాట్లు, పచ్చదనం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తార న్నారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు అందే సతీష్, పోలిశెట్టి రఘురాం, గుడివాడ సాయి, ప్రిన్సిపాల్ కనకారావు, గంధం రామకృష్ణ, వెంకట రత్నం, పాల్గొన్నారు.

ఏపీ ఎఫ్ఏ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పవన్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ సోషల్ మీడియా రాష్ట్ర విభాగం సమన్వయకర్తగా ఏలూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గొట్టపు పవన్ కుమార్‌ను నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డానియల్ ప్రదీప్ ఆదేశాలు జరీ చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ఫుట్‌బాల్ సంఘానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఫుట్‌బాల్ సంఘాలతో సమన్వయ కర్తగా వ్యవహరిస్తూ ఫుట్‌బాల్ క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొనేలా కృషి చేయాలని డానియల్ ప్రదీప్ సూచించారు. ప్రతిష్టాత్మకమైన ఈ పదవి లభించిన సందర్భంగా ఏలూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఫుట్‌బాల్ శిక్షకులు అభినందనలు తెలిపారు.

నేడు వీరంపాలెంలో వసంత పంచమి

సామూహిక అక్షరాభ్యాసానికి ప్రత్యేక ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : చిన్నారులతో ఓనమాలు దిద్దించాలని, ఆ ఓనమాలు దిద్దించే ముహూర్తం వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కలలు కంటుంటారు. సరస్వతి అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి రోజున అక్షరాభ్యాసాలు చేసేందుకు తల్లిదండ్రులు ఎదురుచూస్తుంటారు. ఈ మేరకు ఆదివారం వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీ క్షేత్రంలోని మేధా సరస్వతి ఆలయం సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. ఏటా వసంత పంచమి రోజున వీరంపాలెం క్షేత్రంలో రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా అక్షరాభ్యాసాలు చేసేందుకు వస్తుంటారు. ఒకేసారి భారీగా అక్షరాభ్యాసాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరిదేవి పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి మాట్లాడుతూ ఈ పీఠాన్ని ఆంధ్రాలో మరో బాసరగా భావిస్తారని, ఉత్తరాంధ్ర, కోస్తా, తదితర ప్రాంతాల నుంచి వసంత పంచమికి వస్తుంటారని తెలిపారు. వారందరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు.

వేసవిలో తాగునీటి కొరత రానివ్వం : బడేటి చంటి


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. దెందులూరు వద్ద సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును శనివారం మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది ఇదే రోజుల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 16 మీటర్ల నీటిస్థాయి ఉండగా ఇప్పుడు 13 మీటర్లకు తగ్గిందన్నారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటిని పంపింగ్ చేసే మోటార్లు మరమ్మతులకు రావడంతో వాటిస్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంత సురేంద్రబాబు, ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎలీటీ శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు, కోఆప్షన్‌సభ్యుడు బోడే వెంకటరత్నం, ఎస్ ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : చింతమనేని


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి/పెదపాడు ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శనివారం పలు గ్రామాలనుంచి వచ్చిన ప్రజలు సమస్యలను విన్నవించారు. సీఎం సహాయనిధి ద్వారా వైద్యానికి సాయం చేయాలని, పింఛను మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కావాలని కోరుతూ వినతులు అందించారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని, ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర ప్రగతి ప్రారంభమైందని, త్వరలోనూ సంక్షేమ ఫలాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

● పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దేవాలయ ఈవో పితాని తారకేశ్వరరావు తెలిపారు. దేవాలయ అభివృద్ధి, పలు అభివృద్ధి పనులపై వివరించేందుకు ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు, ఈవో తారకేశ్వరరావు శనివారం క్యాంపు కార్యాలయం వద్ద కలిశారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి : చిర్రి బాలరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం/ఏలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. శనివారం స్థానిక రోటరీ ఫంక్షన్‌హాలులో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేసేందుకు సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా ఎంపికైన రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రేష్ఠ రామకృష్ణ, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదే పల్లి శ్రీనివాస్, టీడీపీ నాయకురాలు గంగిరెడ్డి మేఘలా దేవి, బొల్లిన నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆలపాటి గంగా భవానీ కల్యాణ మండపంలో చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకుందామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యతా ఓటును రాజశేఖర్‌కు వేసి గెలిపించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఐటీఐ జిల్లా స్థాయి అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌లో తంగెళ్లమూడి శ్రీహర్ష ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులను అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించి అత్యధిక ఫలితాలు సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, కె.వరప్రసాదరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.డానియేల్, హెచ్‌ఎం దుర్గారావు, పీఈటీలు డి.రవి, కేశవ, సుకన్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత నియమాలు తెలుసుకోవాలి


మాట్లాడుతున్న ఏఎంవీఐ జగదీశ్


ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుండే రహదారి భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ మోటారు వెహికల్స్ ఇన్స్పెక్టర్ ఎస్.జగదీశ్ బాబు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం శనివారపుపేటలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు, సిబ్బందికి రహదారి భద్రతపై రవాణాశాఖ తనిఖీ అధికారులు అవగాహన కల్పించారు. రోడ్డును దాటేటప్పుడు జీబ్రాలైన్లపై మాత్రమే దాటాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలన్నారు. గాయపడిన వ్యక్తికి ఏ విధమైన ప్రథమ చికిత్స అందించాలో విద్యార్థులకు తెలియజేశారు. క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. వాహన తనిఖీ అధికారులు ఆజ్మీర బద్దు, ఎం.డి. జమీర్, ఎస్.నెహ్రూ, ప్రైవేట్ ఆర్ఎంవీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్, గోపాలపురం సెక్టార్‌లో మహిళా, శిశుసంక్షేమ శాఖ పీడీ పి.శారద మండలంలోని ఎం.నాగులపల్లి-2, ద్వారకానగర్ అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రీస్కూల్ కార్యక్రమాలు, పోషణ వాటిక వర్షపునీరు, హార్వెస్టింగ్‌ను పరిశీలించారు. ప్రీస్కూల్ సెంటర్ సిలబస్‌ను పరిశీలించారు. పిల్లలను అభినందించారు. హాజరు, రికార్డులు, పిల్లల ఎదుగుదల గురించి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు పలు సూచనలిచ్చారు.

ఆధ్యాత్మికం

రథసప్తమి వేడుకలకు శ్రీవారి క్షేత్రం ముస్తాబు


ద్వారకాతిరుమలలో సూర్య, చంద్రప్రభ వాహనాలను బయటకు తెస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం రథసప్తమి వేడుకలకు ముస్తాబవుతోంది. ఈనెల 4న జరుగనున్న వేడుకల నిమిత్తం ఆలయ వాహనశాలలో ఉన్న సూర్య, చంద్రప్రభ వాహనాలను శుభ్రం చేసేందుకు శనివారం సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ఈనెల 4న ఉదయం ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపైనా, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపైనా తిరువీధుల్లో విహరిస్తారని ఇన్‌ఛార్జి ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. శనివారం ఆలయానికి దాదాపు 15వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆళివారంగ తెలిపారు. సంఘం నాయకులు బొల్లు సత్యనారాయణ, మారం రమేష్, ఉదార ప్రసాద్ తెలిపారు. స్వామి కల్యాణం ఈనెల 11న అర్ధరాత్రి మూడు గంటలకు జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఉంగుటూరు : నారాయణపురం వద్ద వున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన కల్యాణోత్సవాలలో నిత్యపూజలు అనంతరం శనివారం శ్రీచక్ర స్నానం పూజలను రుత్విజులు నిర్వహించారు. ఏలూరు ప్రధాన కాల్వలో స్వామి అమ్మవార్లకు చక్రస్నానాన్ని పీఠం మీద కూర్చున్న దంపతులు రుత్విజుల సమక్షంలో నిర్వహించారు.

మద్ది ఆంజనేయునికి పూజలు

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెంలో వున్న మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం స్వామికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహించారు.

8 నుంచి వీరభద్రస్వామి కల్యాణోత్సవాలు

కామవరపుకోట: కామవరపుకోటలోని భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం వద్ద

పూతరాని మామిడి

» తెగుళ్ల బెడదతో రైతులు దిగాలు » పురుగు మందుల పిచికారీతో అదనపు భారం

లింగపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉండగా సగానికి పైగా తోటల్లో పూత, పిందెలు రాకపోవడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దిగుబడిపై కాయలు కాయాల్సిన సమయంలో కనీసం పూతలేకపోవడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో మామిడి దిగుబడిపై రైతులు దిగాలు చెందుతున్నారు. వాతావరణ ప్రభావంతో పొగమంచు కురుస్తుండడంతో పూత మాడిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు, పూత, పిందెలు రావడానికి మూడు నుంచి నాలుగు సార్లు అధికమొత్తంలో పురుగుమందులు పిచికారీ చేయడంతో ఖర్చు అధికి మోపెడు భారం ఎక్కువవుతుందని రైతులు వాపోతున్నారు. తోటలను కౌలుకు తీసుకునేందుకు కౌలుదారులు ముందుకు రాకపోవడంతో దిగాలు చెందుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలలో తేడాలతో పూతపై ప్రతికూల వాతావరణం కనపడుతుంది. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలతోపాటు మామిడి తోటలకు అధిక మొత్తంలో రసాయన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడంతో పూత అలస్య మవుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నా మామిడిరైతుల్లో ఆందోళన తగ్గడం లేదు.


పూతరాని మామిడి చెట్టు

పూత ఆలస్యంతో నష్టాలు తప్పవు..



మామిడి తోట పూత రాకపోవడంతో పురుగు మందులకు అధికమొత్తంలో ఖర్చవుతోంది. డిసెంబరు, జనవరి నెలలకు కూడా పూత రాకపోవడంతో ఆందోళనగా ఉంది. పొగమంచు, పగటి ఉష్ణోగ్రతలలో తేడాలతో ప్రతికూల వాతావరణం ఉంది. ఇప్పటికే మూడుసార్లు మందులు పిచికారీ చేశా. ఈ ఏడాది పూత ఆలస్యమవడంతో నష్టాలు తప్పవు.

– వాడపల్లి ప్రమోద్, మామిడితోట యజమాని

అరసవల్లికి ధర్మప్రచార రథం


ప్రచార రథం ఎదుట ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధర్మప్రచార రథం శనివారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా అరసవల్లికి పయనమైంది. రథసప్తమిని పురస్కరించుకుని రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో ప్రధాన ఆలయాల నుంచి ప్రచార రథాలు అక్కడ ఈనెల నాలుగో తేదీ వరకు ఉండాలని దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం నుంచి అరసవల్లిలో జరిగే రథసప్తమి ఉత్సవాలకు శ్రీవారి క్షేత్రం నుంచి ప్రచార రథం పయనమైంది. ఆలయ ఏఈవో పి.నటరాజారావు కొబ్బరి కాయకొట్టి ప్రారంభించారు. సూపరింటెండెంట్ హయగ్రీవాచారి, ఆచారి, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

» ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజనుల విద్యతోనే వెనుకబాటుతనాన్ని అధిగమించవచ్చని, పరీక్షలు దగ్గరపడుతున్నందున టెన్త్ విద్యార్థులు సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వీఎస్ శంకర్ నాయక్ తెలిపారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా రెండో రోజు శనివారం మండలంలోని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాఠశాలపై విద్యార్థుల పట్టుత్వాన్ని స్వయంగా పరిశీలించారు. అధికారులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉత్తీర్ణత పెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. చదువుతున్న ప్రాముఖ్యతను వివరించారు.ఏపీవో, ఇన్‌ఛార్జి డిడీ పీవీఎస్ నాయుడు, డీవైఈవో జె.రామ్మోహనరావు, ఏఎంవో కె.శరమయ్య, ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, ఆరోగ్య ల్యాబ్ ఫీవీ చలపతిరావు సిబ్బంది ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి ఇంటి పట్టా అందజేత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సామాన్యుడికి న్యాయం చేసేందుకు ముందు టానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దొరసానిపాడుకు చెందిన సయ్యద్‌మాన్ సాహెబ్ నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలిచి, వారికి నూతనంగా ఇంటి స్థలాన్ని కేటాయించి పట్టాను అందించారు. గత 30 ఏళ్లుగా భూవివాదంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆయన స్పందించి వారికి న్యాయం చేశారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పీవోను కలిసిన జనసేన నాయకులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరుకు చెందిన జనసేన నాయకులు శనివారం కెఆర్‌పురం ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌ఆర్ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. పీవోను కలిసినవారిలో ఎంఎంయుగంధర్, ఎం.గోపాలకృష్ణ, కోటి, జి.నరసింహారావు తదితరులు ఉన్నారు.

యోగాపై విద్యార్థినులకు శిక్షణ

పెదపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో యోగాపై కళాశాల విద్యార్థినులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. పీజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణలో విద్యార్థులకు అవసరమైన యోగాసనాలు, వాటి ఉపయోగాలను వివరించారు. వేణుగోపాల్ లూనని, యోగా ట్రైనర్ సాంబశివరావు, చంద్రాని విశ్వనాథరావు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సరళ తదితరులు పాల్గొన్నారు.


తాళ్లమూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : జేసీ ధాత్రిరెడ్డి

పెదపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. శనివారం తాళ్లమూడిలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె పర్యటించి పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులపై ఆరా తీసి సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ, చుట్టూ వున్న డ్రైనేజీ నిర్మించేందుకు అంచనాలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో ఆమీలు జమ, ఎంఆర్వో నరసింహమూర్తి, వెంకటరమణ, సీడీపీవో విజయలక్ష్మి, కార్యదర్శి తంబి, వీఆర్వో శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి : ఏఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరులోని సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేటలో ఉన్న శ్రీశ్రీ ఆసుపత్రి యాజమాన్యం ఏలూరులోని పోలీస్ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సత్యసాయి సేవా సమితి, శ్రీశ్రీ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. నేత్రవైద్యం, జనరల్ మెడిసిన్ విభాగాల్లోని వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూలు ప్రిన్సిపాల్ ప్రవణి, వైస్ ప్రిన్సిపాల్ జి.వరప్రసాద్, శ్రీశ్రీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.ప్పర్సీ నరేష్, డాక్టర్ ఎం.బిందుచౌదరి, నేత్ర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు 'అభయ మహిళా రక్షకదళం'

ఏలూరు క్రైం/ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక దళం సేవలు వినియోగించుకోవాలని దిశ సబ్బంది పేర్కొన్నారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ పర్యవేక్షణలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా పోలీస్ సిబ్బంది కలిసి ఏలూరు నగరంలో పలు కాలేజీలు, హైస్కూళ్ళు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర పోలీస్ సేవల కోసం 112కు కాల్ చేయాలన్నారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలోని శ్రీసత్యసాయి విద్యాగిరి ఈఎం స్కూల్లో చదువుతున్న బాలికలకు చిట్టి వెహికల్ అభయ ద్వారా ఎస్ఐ టి.సుధీర్ నేతృత్వంలో బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్‌క్రైమ్ అంశాలపై మహిళాపోలీస్ లక్ష్మీగౌరి వివరించారు.

రెవెన్యూ సభల్లో వచ్చిన సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కామవరపుకోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, నివేదికలు సమర్పించాలని కామవరపుకోట తహసీల్దార్ గెద్దం ఎలీషా పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సభల్లో 16 రెవెన్యూ గ్రామాల నుంచి 479 వినతులు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 283 సమస్యలను పరిష్కరించామని, మిగిలినవి త్వరితగతిన పరిష్కరించి సంబంధిత నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పి.నాగమల్లేష్, వీఆర్వోలు మాదు లక్ష్మీనారాయణ, బి.రమేష్, ఎస్.కె.మెహబూబ్ సాహెబ్, బి.రాంబాబు, ప్రవల్లిక, పి.లక్ష్మీదేవి, నాగరాణి, కొయ్యగూర బాబూరావు, కంకిపాటి నాగేశ్వరరావు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లపై విజిలెన్స్ దాడులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు, భీమవరంలలో ఉన్న కిరాణా షాపులు, సూపర్‌మార్కెట్లలో అమ్మే సరుకులలో నాణ్యత, కొలతల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబుకు ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు శనివారం ఏలూరు నగరంలో ఏకకాలంలో విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, ఏసీటీఓ ఆరామ్, తూనికలు కొలతల అధికారులు వి.ప్రశాంత్‌కుమార్, రాంబాబు వారి బృందాలతో దాడులు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని పలు షాపుల్లో నిబంధనలు పాటించని కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా వినియోగించడంతో ఎనిమిది దుకాణాదారులపై తూనికలు, కొలతల చట్టం ప్రకారం మొత్తం 18 కేసులు నమోదు చేశారు.

క్రైం వార్తలు

తమ్మిలేరులో పడి ఒకరి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తమ్మిలేరులో పడి ఒకరు మృతి చెందారు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి. విజయరాయి గ్రామ నికి చెందిన అమామ్ సుబ్బారావు(43), భార్య హైమావతితో మనస్పర్ధలు ఏర్పడి ఏ దాదిన్నర కిందట విడిపోయి, తండ్రి కృష్ణతో కలిసి ఉంటున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ అతిగా మద్యం సేవిస్తూ తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి పడిగడుల సమయంలో మద్యం తాగి తమ్మిలేరు వైపు వెళ్లి తిరిగిరాలేదు. శనివారం సాయంత్రానికి తమ్మిలేరులో అతడి మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. శవ పరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. మృతుడి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఆస్తి తగాదాతో తల్లి, చెల్లిపై దాడి..

ఏలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాతో తల్లి, చెల్లెపై పెద్ద కుమార్తె, అల్లుడు మరికొందరితో కలిసి దాడి చేసిన ఘటన శనివారం రాత్రి జంగారెడ్డిగూడెంలో జరిగింది. జంగారెడ్డిగూడెం మండలం పట్టణానికి చెందిన రజియాకు ఇద్దరు కుమార్తెలు. తన పెద్ద కుమార్తె బాను శ్రీని కామవరపుకోట మండలానికి చెందిన పోలిన పురందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్దిరోజుల క్రితం రజియాకు చెందిన ఆస్తిని పెద్దకుమార్తె పేరున రాసివ్వాలంటూ గొడవ పడి ఆస్తి పత్రాలను తన పెద్ద కుమార్తె, అల్లుడు తీసుకువెళ్లిపోయారని తెలిపింది. ఈ ఘటనపై డిసెంబరు 12న జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అయితే పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. శనివారం తనతో పాటు, చిన్నకుమార్తెను పెద్దకుమార్తె, అల్లుడు, మరికొందరితో కలిసి అక్రమంగా ఇంట్లో ప్రవేశించి దాడి చేశారని ఆమె తెలిపింది. గాయాలతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్టు ఆమె తెలిపారు.

బంగారపు వస్తువుల అపహరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బంగారపుషాపులో నగలు కొనుగోలు చేసి ఆటో ఎక్కి ఇంటికి వెళ్లి చూసేసరికి బ్యాగ్ కనిపించకపోవడంతో ఒక రిటైర్డ్ టీచర్ గుమస్తాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు కొత్తపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ పాలేటి కాంతమ్మ గతనెల 31న ఏలూరు వైభవ్ జ్యూవెలర్స్‌లో బంగారపు వస్తువులు కొనుగోలు చేసి కొన్ని వస్తువులను కొనుగోలు చేసి ఆటో ఎక్కి కండ్రికగూడెం ఇంటికి వెళ్లారు. ఆటోలో ప్రయాణికులు కూడా ఉన్నారు. ఇంటికి వెళ్లి చూసేసరికి హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. అందులో నగలు కనిపించలేదు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు బాధితురాలు కాంతమ్మ ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌పై వాయిస్

పేద, మధ్యతరగతి ప్రజల బడ్జెట్



సంక్షేమానికి బాటలు వేస్తూనే అన్ని వర్గాలకు సమన్యాయం చేసే బడ్జెట్ ఇది. పేదలకు నాలుగు కోట్ల ఇళ్లు కట్టించడం నిర్ణయం గొప్ప విషయం. ఐటీ, వ్యవసాయానికి, ఎంఎస్ఎంఈలకు రాయితీలు, ఎక్సైజ్ సుంకం తగ్గింపు నిర్ణయాలతో ప్రజలు సంతృప్తి చెందేలా బడ్జెట్ ఉంది.

– అంబికా కృష్ణ, బీజేపీ సీనియర్ నేత

సీనియర్ సిటిజన్లకు ఊరట



కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ట్యాక్స్ మినహాయింపు వల్ల సీనియర్ సిటిజన్లు ఊరట చెందుతున్నారు. రైలు ప్రయాణ చార్జీల తగ్గింపును పునరుద్ధరిస్తే బాగుండేది. జిల్లాకు ఒక ఓల్డేజ్ హోమ్‌ను నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నా.

– వి.నారాయణ మూర్తి
ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు

బడ్జెట్ అద్భుతం



బడ్జెట్‌లో చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు టాక్స్ పెంచకపోవడం ఉద్యోగులకు ఊరట. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

– చోడగిరి శ్రీనివాస్
ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు

వికసిత లక్ష్యాలకు చేరువగా బడ్జెట్

కేంద్ర బడ్జెట్ వల్ల విద్యారంగంలో కొత్తగా ఐఐటీలు రావడంతోపాటు, ఐఐఎస్సీల్లో పరిశోధనలు చేసే పది వేలమంది రీసెర్చ్ స్కాలర్లకు ఫెలోషిప్ ప్రకటించడంపట్ల పరిశోధనల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపునకు దోహదపడుతుంది. ఉపాధి కల్పనరంగం దిశగా పర్యాటకరంగాన్ని ప్రోత్సహించడం తదితర నిర్ణయాలన్నీ మోదీ విజన్‌గా వున్న వికసిత భారత్ లక్ష్యాలను చేరువచేసేదిగా ఉంది.

– ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్
సీఆర్ఆర్ పీజీ కళాశాల

– ఏలూరు రూరల్/ఏలూరు టూటౌన్/ఏలూరు అర్బన్

ఇంటర్ క్వాలిఫయింగ్ పరీక్షలకు 97 శాతం హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ క్వాలిఫయింగ్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. తొలిరోజున నైతిక, మానవీయ విలువలు పరీక్షను జిల్లాలోని 137 జూనియర్ కళాశాలల్లో నిర్వహించగా, జనరల్ విభాగంలో మొత్తం 15,999 మంది విద్యార్థులకుగాను 15,590 మంది, ఒకేషనల్ విభాగంలో 2,459 మందికి 2,259 మంది మొత్తంగా 97 శాతం మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్య వేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. మొత్తం 609 మంది గైర్హాజరయ్యారని, ఎక్కడా ఆవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.

కల్లుగీత మద్యం లైసెన్సుకు ఎక్కడి నుంచైనా దరఖాస్తు

ఏలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వేషన్ చేసిన 14 దుకాణాల లైసెన్సుల కోసం జిల్లాలో స్థానిక కులాల అభ్యర్థులు ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య తెలిపారు. కల్లుగీత కార్మికుల లైసెన్సు ఫీజులో 50 శాతం చెల్లించాలన్నారు. ఓపెన్ షాపుల ధర రూ.65 లక్షలుండగా, దీనిలో ఈ కేటగిరి లైసెన్సు కోసం రూ.32.50 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజుగా రూ.2 లక్షలు కట్టాలన్నారు.

ఈ-పంటలో వివరాలు నమోదు చేయాలి

లింగపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా తమ పంటలను రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా అన్నారు. కొత్తపల్లిలో శనివారం రైతులకు సమావేశం నిర్వహించారు. గ్రామంలో మొక్కజొన్న, పొగాకు పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న విత్తనోత్పత్తికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నాటు పొగాకు, వర్జీనియా పొగాకు వేసే రైతులు ప్రజా ఆరోగ్యానికి పొగాకు పంట సాగును తగ్గించాలని అన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందించారు. ఏవో కోటగిరి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పెదవేగి మండల పరిషత్ ఏవోగా సత్యనారాయణ

పెదవేగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండల పరిషత్ పరిపాలన అధికారి (ఏవో)గా విస్సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బాధ్యతలు చేపట్టారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జూలీ, జూనియర్ అసిస్టెంట్ అల్లీ సాహెబ్, పెదవేగి గ్రామ కార్యదర్శి పి.వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ నాగలక్ష్మి అభినందించారు.



చిత్తడిపై ఒత్తిడి..

- చిత్తడి నేలల పరిరక్షణపై శాస్త్రవేత్తల హెచ్చరికలు
- జీవరాశి మనుగడకు చిత్తడి నేలలు అవసరమంటూ దిశానిర్దేశం
- ఆటపాక పక్షుల కేంద్రంలో రేపు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు
- భవిష్యత్ తరాల కోసం స్వచ్ఛందంగా పలువురి అవగాహన

మానవాళి మనుగడలో చిత్తడినేలలు ప్రధాన పాత్ర వహిస్తాయనడంలో సదేహం లేదు.. ఎందుకంటే సృష్టిలోని అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడినేలల్లోనే మనుగ డ సాగిస్తుంటాయి. అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న చిత్తడి నేలల జాబితాలో కొల్లేరు సరస్సు ఉండటం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయం.. అయితే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఈ నేలల మనుగడను పరిరక్షించు కోపోతే భావితరాలకు ప్రమాదం పొంచి ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చిత్తడి నేలలు అంతరించిపోతే పలురకాల పక్షులు, జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్ తరాలు వాటిని చూడాలంటే జూపార్కులు, చరిత్రనో తిరగేయాల్సి ఉంటుంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ప్రపంచ మేధావులు ఈ నేలలపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి రెండును ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2వ తేదీ ఆదివారం రావడంతో సోమవారం 3వ తేదీన ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

\- కైకలూరు(ఆంధ్రజ్యోతి)

మానవాళి మనుగడకు చిత్తడినేలలు ఎంతో దోహదపడతాయి. సృష్టిలో సహజసిద్ధంగా ఏర్పడిన వనరులను కాపాడుకుంటే భావితరాలకు స్వచ్ఛ మైన పర్యావరణాన్ని అందించగలుతాం. సృష్టిలో ఉన్న అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడినేలల్లోనే ఉంటాయి. పక్షులకు ఈ నేలల్లో ఆహారం సమృ ద్ధిగా లభిస్తుంది. దీని ప్రాముఖ్యతను గుర్తించి ప్రపంచంలో వివిధ దేశాలు చిత్తడి నేలలను రక్షించుకోవడమే గాక ప్రతి ఏటా ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు చిత్తడి నేలల జాబితాలోనే ఉంది. పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భావితరాలకు చిత్తడినేలలు ఉండవు, ఇప్పటికే పలురకాల పక్షులు, జంతువులు అంతరించిపోయాయని, కొన్ని రకాల జంతువులు పక్షులను చూడాలంటే జూ పార్కులు, చరిత్ర పుస్తకాల్లో చూడాల్సి వస్తోందని ప్రపంచ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1971లో ప్రపంచ స్థాయి సదస్సు

చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించి ఇరాన్ దేశంలోని రామ్‌సర్ నగరంలో 1971వ సంవత్సరంలో ప్రపంచ దేశాలన్నీ కలిసి సదస్సును నిర్వహించాయి. ఈ సదస్సుల్లో చిత్తడినేలల ఆవశ్యకతను గుర్తించారు. ప్రపంచంలోని ఏ దేశంలో ఉన్నా వాటిని పరిరక్షించాలని ఆయా దేశాల ప్రతినిధులు తీర్మానించారు. అదే రోజును పురస్కరించుకుని ఫిబ్రవరి 2ను చిత్తడినేలల దినోత్సవంగా గుర్తించి రామ్‌సర్‌సైట్‌గా నామకరణం చేశారు. ప్రపంచంలో పలు దేశాల్లో చిత్తడినేలలుగా పేరొందిన ప్రాంతాలను ఈ సైట్‌లోనికి తీసుకొచ్చారు. చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా దేశాలకు వివరించారు. భారత దేశంలో అతిపెద్ద సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొల్లేరు సరస్సును 2002 సంవత్సరంలో రామ్‌సర్ సైట్‌లోకి తీసుకున్నారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సరస్సు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

2009 నుంచి అవగాహనకు కార్యాచరణ

2006లో కొల్లేరును అటవీ శాఖ అధికారులకు అప్పగించగా 2009 నుంచి కైకలూరు మండలం ఆటపాకలోని వలస పక్షుల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి కొల్లేరు చిత్తడినేలల ఆవశ్యకతపై పలు పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అటవీశాఖ అధికారులు బహుమతులు పంపిణీ చేస్తారు.

మరచిన తాటిదోనెల పోటీలు

చిత్తడినేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2018వ సంవత్సరంలో కొల్లేరులోని సర్కారు కాలువలో తాటి దోనెల పోటీలను నిర్వహించారు. రెండు సంవత్సరాల పాటు ఈ పోటీలను కొనసాగించినా తరువాత నుంచి వీటిని అధికారులు మరచిపోయారు. తాటి దోనెల పోటీల తో ప్రజలకు చిత్తడినేలల ఆవశ్యకత తెలుస్తుందని వీటిని ప్రారంభించారు. అటవీ శాఖ అధికారులు వీటిని నిర్వహించడంలో విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రేపు విద్యార్థులకు పోటీలు

చిత్తడినేలల ఆవశ్యకతను తెలియజేసేలా ప్రతి ఏటా ఫిబ్రవరి 2న అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే ఈ ఏడాది 2వ తేదీ ఆదివారం రావడంతో 3వ తేదీన సోమవారం వెయ్యిమంది విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టాం. విద్యార్థులకు చిత్తడినేలలు, కొల్లేరుపై వ్యాస రచన, డిబెట్, చిత్రలేఖనం పోటీలను నిర్వ హిస్తున్నాం. ఈ సంవత్సరం అటవీ శాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చిత్తడినేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

\- రామలింగాచార్యులు, రేంజర్, కైకలూరు


లోకుముడిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన

మండవల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను రక్షించుకుంటే మానవ మనుగడకు రక్షణ కలుగుతుందని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్ కుమార్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకుముడి జడ్పీ హైస్కూల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం హెచ్ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన విద్యార్థులకు చిత్తడి నేలల ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన కల్పించారు.

కేంద్ర బడ్జెట్ ఆమోదయోగ్యం : ఎమ్మెల్సీ

కైకలూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. శనివారం కేంద్ర బడ్జెట్‌పై ఆయన కైకలూరులో మాట్లాడుతూ అన్ని రంగాల్లో మార్పులు చేస్తూ పేదరికాన్ని తగ్గించి ప్రజలు జీవనప్రమాణాలను పెంచే దిశగా బడ్జెట్‌ను రూపొందించారని అన్నారు. ఆదాయపు పన్ను రూ.12 లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు భారీ ఊరట కలిగించిందన్నారు. అలాగే రాష్ట్రానికి మరింత బడ్జెట్‌ను కేటాయించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మరింత సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.


తాళ్ళమూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : జేసీ ధాత్రిరెడ్డి

పెదపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. శనివారం తాళ్ళగూడెంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె పర్యటించి పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులపై ఆరా తీసి సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ, చుట్టూ వున్న డ్రెయినేజీ నిర్మించేందుకు అంచనాలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో అమీలు జమ, ఎంఈవోలు నరసింహామూర్తి, వెంకటరమణ, సీడీపీవో విజయలక్ష్మి, కార్యదర్శి తంబి, వీఆర్వో శర్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువులకు నీటి సరఫరా

ముదినేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : కాల్వలకు నీరు విడుదల చేయడంతో ముదినే పల్లి మండలంలోని పలు గ్రామ పంచాయతీలు చెరువులను నింపుకునే పనిలో ఉన్నాయి. ప్రధాన కాల్వల నుంచి గ్రామాల్లోని చెరువులకు నీరు సరఫరా అయ్యే అవకాశం లేకపోవడంతో ఇంజన్ల ద్వారానే తోడాల్సి వస్తోంది. చెరువులను నింపుకునేందుకు బ్రాంచ్ కాల్వలు, చెరువుల వద్ద ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల చెరువులను పూర్తిస్థాయి లో నీరు నింపాలంటే కాల్వలకు నీటి విడుదల మట్టాన్ని పెంచా ల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం క్యాంప్ బెల్ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, పోల్‌రాజ్ కెనాల్‌కు 200 క్యూసెక్కుల నీటిని గుడ్లవల్లేరు లాకుల వద్ద విడుదల చేస్తున్నారు. రెండు కాల్వలకు మరో వంద క్యూసెక్కులు పెంచాల్సిన అవసరం ఉందని సర్పంచ్‌లు చెబుతున్నారు.


పెదగొన్నూరు పంచాయతీ చెరువుకు ఇంజన్లతో నీరు తోడుతున్న దృశ్యం

భూ రీ సర్వే వేగవంతం చేయాలి

తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భూ రీ సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శనివారం వెంకటాపురంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు బృందాలు భూములకు రీ సర్వే చేస్తున్నాయన్నారు. గతంలో ఎల్‌పీఎస్ నెంబర్లు జాయింట్‌గా ఇవ్వడంలో తప్పులు దొర్లాయ న్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రణాళికాబద్ధంగా జరుగుతుందన్నారు.


కొండంగి 1, 2 ఎత్తిపోతల కమిటీ చైర్మన్లు, సభ్యులు

కొండంగి 1, 2 ఎత్తిపోతల కమిటీ చైర్మన్ల నియామకం

కలిదిండి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొండంగి 1, 2 ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌గా వేగిరెడ్డి చిన్నారావు, కోటి సూర్యనారాయణలు శనివారం నియమితులయ్యారు. వైస్ చైర్మన్లుగా ఎస్.రాంబాబు, మహ్మద్ అమర్ సభ్యులుగా టి.చిన్ని కృష్ణ, వి.సత్యనారాయణ, డి.వీర బాబు, పి.శ్రీనివాసరావు, పి.రామయ్య, వెంకట దుర్గారావు, బి.భోగేశ్వరరావు, వి.రామకృష్ణ, పోసిన ఈరేశ్, కృష్ణంరాజు, బి.పెద్దిరాజు, బి. వెంకటేశ్వరరావు, ఎ.రమణ, ఎస్.శ్రీరామ కృష్ణ, కోశాధికారిగా చిట్టూరి రవికిరణ్ నియమితులయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పాపారావు గౌడ్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముదినేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 1395 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా ముదినేపల్లిలోని జడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం తహసీల్దార్ సుభానీ వాటిని పరిశీలించారు. హెచ్ఎం విజయ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ముదినేపల్లిలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభానీ

తాగునీటి సమస్యకు చెక్

ముదినేపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ సహకారంతో ముదినేపల్లి శివారు అన్నవరంలోని ఎస్టీలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటికి ఎస్టీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక చర్చి పాస్టర్ సునీల్‌తో పాటు పలువురు వినోద్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన బోరింగ్ చేతి పంపును శనివారం ఏర్పాటు చేయించడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.



చేవూరు రోడ్డు అభివృద్ధికి శ్రీకారం

ముదినేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు అభివృద్ధి పనులు ఎట్టకేలకు శని వారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ వల్ల ఈ రోడ్డు అభివృద్ధికి రూ.80 లక్షలు మంజూ రు కాగా పనులు ప్రారంభించారు. ఆర్‌అండ్ బీ డీఈఈ అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఏఈ అరవింద్ రోడ్డు పనులను నిర్వహిస్తున్నారు.


సింగరాయపాలెం - చేవూరు బీటీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

'వ్యక్తిగత కారణాలను కులాలపై ఆపాదించొద్దు'

కైకలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కైకలూరు సర్పంచ్ తన చెక్‌పవర్ పోయిందనే విషయంపై పదే పదే మాట్లాడుతూ దళితుల ప్రస్తావన తీసుకురావడం తగదని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, గాలి ప్రసాద్ పేర్కొన్నారు. కైకలూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కైకలూరులోని అన్నికులాల ప్రజల మద్దతుతో ఎస్సీ సర్పంచ్‌ను గెలిపించారని గుర్తు చేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే విచారణ చేపట్టి చెక్ పవర్‌ను నిలిపివేశారన్నారు. చెక్ పవర్ నిలిపివేయడం సర్పంచ్ వ్యక్తిగత విషయమని, ఇందులో దళితజాతి ప్రస్తావన సరికాదన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు మత్తే రవిప్రసాద్, వరిగంజి రాజారత్నం, రుంజుల విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు చర్యలు

కార్యదర్శి ఆనంద భూషణం

కైకలూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కైకలూరులో డ్రెయిన్ల మరమ్మతులను నిర్వహించి మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఆనంద భూషణం తెలిపారు. శనివారం కైకలూరు మాగంటి థియేటర్ వద్ద డ్రెయిన్ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక తొలగించి మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగం, తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో డ్రెయిన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి ఆనందభూషణం


అశ్వవాహనంపై ఊరేగుతున్న శోభనాచలుడు

అశ్వవాహనంపై ఊరేగిన శోభనాచల స్వామి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో మూడవ రోజు శనివారం అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. శోభనాచల స్వామిని అశ్వవాహనంపై ఊరేగింపు చేశారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి యాదవ సంఘం వారు కైంకర్యపరులుగా నిత్యకళ్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు.

ఎక్సైజ్ దాడులు

ముసునూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మద్యం, సారా విక్రయాలపై నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముసునూరుకు చెందిన కంచర్ల పార్వతి సారా అమ్మకాలు చేస్తుండగా పట్టుకుని మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ఎ. మస్తానయ్య తెలిపారు. చెక్కపల్లి గ్రామానికి చెందిన చిలుకబత్తుల తులసమ్మ మద్యం విక్రయాలు చేస్తుండగా పట్టుకుని, 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అరసవల్లికి ధర్మప్రచార రథం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి ధర్మప్రచారం రథం శనివా రం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా అరసవ ల్లికి పయనమైంది. రాష్ట్రప్రభుత్వం రథసప్త మి వేడుకలను రాష్ట్ర పండుగలా గుర్తించడంతో ప్రధాన ఆలయాల నుంచి ప్రచార రథాలు అక్కడ ఈనెల నాలుగో తేదీ వరకు ఉండాలని దేవదాయ శాఖ కమిషనర్ ఉత్త ర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం నుంచి అరసవల్లిలో జరిగే రథసప్తమి ఉత్సవాలకు శ్రీవారి క్షేత్రం నుంచి ప్రచార రథం పయనమైంది.


చిన్నంపేటలో వందేమాతరం ఓటీటీ సినిమా షూటింగ్

చిన్నంపేటలో వందేమాతరం షూటింగ్

చాట్రాయి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో శనివారం దేశభక్తి, మతసామరస్యం ప్రబోధించే వందేమాతరం ఓటీటీ సినిమా షూటింగ్ జరిగింది. అలనాటి అగ్ర సినీహీరో శోభన్‌బాబు మేనల్లుడు వేగి రాజా ఈ ఫిలింలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో స్థానిక సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు నటించగా కొన్ని సన్నివేశాలు పాట చిత్రీకరించారు. వీవీ రత్నం స్వీయ దర్శకత్వంలో ఈచిత్రాన్ని నిర్మిస్తుండగా, గ్రామంలో తొలిసారి సినిమా షూటింగ్ జరగటంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలోని తుమ్మగూడెం(బి) పాల సహకార సంఘం సభ్యుడు ములుగుమాటి ప్రసాద్ కుమార్తె దీప్తి వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని అందించారు. క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షురాలు మందలపు పద్మావతి పెండ్లి కుమార్తెకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ నాగేశ్వరరావు, వేతన కార్యదర్శి సత్యనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.


పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేస్తున్న మేనేజర్

తమ్మిలేరులో పడి ఒకరి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తమ్మిలేరులో పడి ఒకరు మృతి చెందారు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. విజయరాయి గ్రామా నికి చెందిన అమామ్ సుబ్బారావు(43), భార్య హైమావతితో మనస్పర్థలు ఏర్పడి ఏ డాదిన్నర కిందట విడిపోయి, తండ్రి కృష్ణతో కలిసి ఉంటున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ అతిగా మద్యం సేవిస్తూ తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి పదిగంటల సమయంలో మద్యం తాగి తమ్మిలేరు వైపు వెళ్లి తిరిగిరాలేదు. శనివారం సాయంత్రానికి తమ్మిలేరులో అతడి మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. శవ పరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఆస్తి తగాదాతో తల్లి, చెల్లిపై దాడి

ఏలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాతో తల్లీ, చెల్లిపై పెద్ద కుమార్తె, అల్లుడు మరికొందరితో కలిసి దాడి చేసిన ఘటన శనివారం రాత్రి జంగారెడ్డిగూడెంలో జరిగింది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రజియాకు ఇద్దరు కుమార్తెలు. తన పెద్ద కుమార్తె భాను శ్రీని కామవరపుకోట మండలానికి చెందిన పోలిన పురంధర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్దిరోజుల క్రితం రజియాకు చెందిన ఆస్తిని పెద్దకుమార్తె పేరున రాసివ్వాలంటూ గొడవ పడి ఆస్తి పత్రాలను తన పెద్ద కుమార్తె, అల్లుడు తీసుకువెళ్లిపోయారని తెలిపింది. శనివారం తనతో పాటు, చిన్నకుమార్తెను పెద్ద కుమార్తె, అల్లుడు, మరికొందరుతో కలిసి అక్రమంగా ఇంట్లో ప్రవేశించి దాడి చేశారని ఆమె తెలిపింది. గాయాలతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్టు ఆమె తెలిపారు.


చిన్నంపేటలో ఆర్‌అండ్‌బీ రహదారిపై పెద్దగొయ్యి

ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి

చాట్రాయి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చిన్నంపేట దళితవాడ వద్ద రోడ్డుకు భారీ గుంత ఏర్పడింది. గృహాల్లో వాడిన మురుగు నీరు ఈ గుంతలోకి వచ్చి వాహనాల తాకిడికి రోజు రోజుకు పెద్దది అవుతున్నది. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహన చోదకులు ఈ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చి ప్రమాదాలు జరక్కుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్లుగీత మద్యం లైసెన్సుకు ఎక్కడి నుంచైనా దరఖాస్తు

ఏలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వే షన్ చేసిన 14 దుకాణాల లైసెన్సుల కోసం జిల్లాలో స్థానికత కలిగిన అభ్యర్థులు ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య తెలిపారు. కల్లుగీత కార్మికుల లైసెన్సు ఫీజులో 50 శాతం చెల్లించాలన్నారు. ఓపెన్ షాపుల ధర రూ.65 లక్షలుండగా, దీనిలో ఈ కేటగిరి లైసెన్సు కోసం రూ.32.50 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజుగా రూ.2 లక్షలు కట్టాలన్నారు.

ఇంటర్ క్వాలిఫయింగ్ పరీక్షలకు 97 శాతం హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ క్వాలిఫయింగ్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. తొలిరోజున నైతికత, మానవీయ విలువలు పరీక్షను జిల్లాలోని 137 జూనియర్ కళాశాలల్లో నిర్వహించగా, జనరల్ విభాగంలో మొత్తం 15,999 మంది విద్యార్థులకుగాను 15,590 మంది, ఒకేషనల్ విభాగంలో 2,459 మందికి 2,259 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. మొత్తం 609 మంది గైర్హాజరయ్యారని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.